ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 13 నవంబరు 2024 | 5

చెగోడీలకో ఊరు..

ప్రత్యేక కథనం 6లో



- చెగోడీలకు కేరాఫ్ నారాయణలంక
- కపిలేశ్వరపురం మండలంలో ఓ కుగ్రామం
- 25 కుటుంబాలకు జీవనాధారం



అసెంబ్లీ విప్‌గా దాట్ల

ముమ్మిడివరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీలో విప్‌గా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు(బుచ్చిబాబు) నియమితులయ్యారు. 15 మందితో విడుదల చేసిన జాబితాలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు అవకాశం దక్కింది. పార్టీ కార్యక్రమాలు చురుకుగా అమలు చేయడంతోను, సభ్యత్వాల నమోదులోను దాట్ల సుబ్బరాజు సమర్థవంతంగా బాధ్యతలు నెరవేర్చడంతో పార్టీలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గత ఎన్నికలలో 38736 మెజార్టీతో విజయం సాధించారు. అయితే దాట్లకు మంత్రివర్గంలో స్థానం లభించవచ్చునని అందరూ ఆశించినా అవకాశం దక్కలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబునాయుడు దాట్ల బుచ్చిబాబుకు అసెంబ్లీ విప్‌ల 15 మందిలో ఒకరిగా అవకాశం కల్పించారు. దీనిపై ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అడగకుండానే తనకు విప్‌గా అవకాశం కల్పించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తనపై పార్టీ ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానన్నారు.

ర్యాంపుల కోసం రగడ

పి.గన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

బోట్స్‌మెన్ ర్యాంపులు అక్రమమా....సక్రమమా!?
తేల్చుకోలేని స్థితిలో రెవెన్యూ యంత్రాంగం
ప్రభుత్వ నిబంధనలకు పాతర!



ర్యాంపును అడ్డుకున్న అధికారులు

ప్రభుత్వం అందించే ఉచిత ఇసుకపై మండల స్థాయి అధికార యంత్రాగానికి ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో ర్యాంపుల రగడ మొదలైంది. స్థానికంగా ఉన్న సొసైటీలు పేరుతో నిర్వహించే బోట్స్‌మెన్ ర్యాంపులు విషయంలో వివాదాలు మొదలయ్యాయి.

నిబంధనలకు విరుద్ధంగా

పి.గన్నవరం అక్విడెక్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా శ్రీవెంకటేశ్వర సాండ్ అండ్ క్వారీ బోట్స్‌మెన్, ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ర్యాంపు నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే అక్విడెక్టుకు లంకలగన్నవరం వైపు మరో ర్యాంపును (నడిగాడి బోట్స్‌మెన్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ) సోమవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ ర్యాంపును వివిధ ఫిర్యాదులు మేరకు స్థానిక రెవెన్యూ యంత్రాంగం పోలీసుల సాయంతో ర్యాంపును అడ్డుకున్నారు. దీంతో సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఒకరికో న్యాయం మరొకరికో న్యాయం చేస్తారా... అంటూ స్థానిక అధికారులను ప్రశ్నించారు. వారికి వర్తించిన నిబంధనలు తమకు వర్తించవా అంటూ నిలదీశారు. సీఎం చంద్రబాబు ఇసుక ఎక్కడ ఉన్నా స్థానిక అవసరాలకు తీసుకోమని బహిరంగ ప్రకటన చేస్తే ఇసుక ట్రాక్టర్లను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీంతో తహశీల్దార్ పి.శ్రీపల్లవి బోట్స్‌మెన్ ర్యాంపులకు ఏవిధమైన అనుమతులు లేవని చెబుతూ...అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న ర్యాంపులను నిలిపివేయాలని సిబ్బందికి సూచించారు. అయితే లంకలగన్నవరంలో ర్యాంపును నిలిపివేసినప్పటికి పి.గన్నవరంలో మాత్రం యథావిధిగా నడిచింది.



ర్యాంపుల కోసం సన్నాహాలు

స్థానికుల విమర్శలు

రెవెన్యూ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు చూస్తుంటే నిబంధనలు పక్కనపెట్టి నియోజవకర్గ పెద్ద నాయకుల కనుసన్నల్లో ర్యాంపులు నడుస్తున్నాయని వారు ఊ...అంటేనే ర్యాంపులు నడుస్తాయని స్థానికులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. బోట్స్‌మెన్ ర్యాంపులు అక్రమమా లేక సక్రమమా తేల్చుకోలేని స్థితిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. గంటకో మాట పూటకో నిబంధన చెబుతూ నాయకుల ఆదేశాలకు వంత పాడి ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తున్నారు. కనీసం అక్విడెక్టుకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు జరపాలన్న నిబంధనను సైతం పక్కనపెట్టడం గమనార్హం. అయితే పి.గన్నవరం మండలంలోనే కాకుండా జిల్లాలోని పలు మండలాల్లో గోదావరి నదీతీరాల్లో బోట్స్‌మెన్ ర్యాంపులు నడుస్తున్నాయని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇసుక ట్రాక్టరు వచ్చి సుమారుగా రూ.4 వేలు పైమాటేనని ఇలాగైతే ఉచిత ఇసుక విధానం ఎక్కడ ఉందని ఇసుకపై మళ్లీ పాత పద్ధతేనని పలువురు విమర్శలు చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా ఇసుక ర్యాంపులు ఏర్పాటుకు పలువురు నాయకులు ప్రత్యేక సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. కె.ఏనుగుపల్లి, లంకలగన్నవరం తదితర ప్రాంతాలతో పాటు పలుచోట్ల ర్యాంపులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఉచిత ఇసుక విధానంపై స్థానిక రెవెన్యూ యంత్రాంగం కనీస పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలు మాట పక్కన పెడితే దళారులు ప్రమేయం ఎక్కువగా కనబడుతుంది. ఇలాగైతే సామాన్యానికి ఇసుక అందే ప్రసక్తే లేదని పలువురు చెప్పుకుంటున్నారు.

రేపటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్

ఇంటింటా సర్వే చేయనున్న వైద్య సిబ్బంది
కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి నాన్ కమ్యూనకబుల్ వ్యాధుల 3.0 ఇంటింటా సర్వేను ప్రారంభించిన మొత్తం 9 నెలల పాటు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. నోటి కేన్సర్, రొమ్ముకేన్సర్, గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తారన్నారు. ఇంటింటా సర్వేతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ ఆవిష్కరించారు. కేన్సర్ స్క్రీనింగ్ సర్వే తొమ్మిది నెలల పాటు వారంలో మంగళ, బుధ, గురువారాల్లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ ఆశ వర్కర్లు నిర్వహిస్తారన్నారు. సర్వేలో గుర్తించిన కేన్సర్ కేసులు, అనుమానిత కేసులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ జాన్‌లెవీ పాల్గొన్నారు.

సర్కారు వారోత్సవాలు..

వికసిత భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వారోత్సవాల నిర్వహణపై ముద్రించిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయి. జిల్లాలోని వ్యవసాయ కార్మిక సహకార సంఘాలు అన్నింటినీ త్వరితగతిన కంప్యూటరీకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. సంఘ సభ్యులకు సొసైటీల ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ నెల 14న సహకార సంఘ ఉద్యమం-బలోపేతం, 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక సుపరిపాలన, 16న ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థలు, వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం చెందడం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించుట, 19న మహిళలు, యువత, బలహీనవర్గాల కోసం సహకార సంఘాల కృషి, 20న వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర, సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధన అనే అంశాలపై వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్టర్లు జి.సత్యప్రసాద్, సురేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తక్కువ కోట్ చేసిన వారికే..

ఇసుక రీచ్‌ల నిర్వహణకు అనుమతులు

అధికారుల సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అర్హత సాధించి అతి తక్కువ ధరలో కోట్ చేసిన వారికే ఇసుక రీచ్‌ల నిర్వహణకు అనుమతులు ఇస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. జిల్లాలోని పన్నెండు ఇసుక రీచ్‌ల్లో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు, వాహనాల లోడింగ్, స్టాకు పాయింట్ల వరకు రవాణా, స్టాకు పాయింట్ల నుంచి వాహనాల్లో ఇసుకను లోడ్ చేయడానికి చార్జీల వసూళ్ల నిమిత్తం పిలిచిన షీల్డు టెండర్ల టెక్నికల్ బిడ్‌లను పూర్తి పారదర్శకతతో ధ్రువీకరించాలని సూచించారు. పన్నెండు కంపెనీలు సమర్పించిన ధ్రువపత్రాలు, టర్నోవర్, కంపెనీల ప్రామాణికతను ఐదు లీగల్ అంశాల అర్హతలను ధ్రువీకరించి నిర్దేశిత ప్రొఫార్మాలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇసుక టెండర్ల బిడ్‌లు ధ్రువీకరణ కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. జిల్లాలోని 12 ఇసుక రీచ్‌లను 2025వ సంవత్సరం మార్చి 14 వరకు అప్పగించేందుకు ఫైనాన్షియల్ బిడ్‌లు, సీల్డు టెండర్లను స్వీకరించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, గనులు, భూగర్భశాఖ అధికారి ఎల్.వంశీధర్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ నాలింగేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఆడిట్ అధికారి ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పి.శివరామకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, జలవనరులశాఖ డీఈ బి.శ్రీనివాసరావు, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రోడ్లు, వంతెనల విస్తరణకు ప్రతిపాదనలు

వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కాకినాడ నుంచి నేరుగా ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటుకు భారీ వాహనాలు సులభతరంగా చేరుకునే విధంగా రోడ్లు, వంతెనల విస్తరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఇంజనీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలక, జలవనరులు, డ్రైనేజీ శాఖల ఇంజనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల విస్తరణ కోసం చేపట్టాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. రోడ్లు, వంతెనలు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఓఎన్జీసీ రిగ్‌లు, ఇతర సామగ్రి తరలించే భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రెండు రోజుల్లో అందజేయాలని సూచించారు. సంబంధిత నివేదికలను క్రోడీకరించి ఓఎన్జీసీ సంస్థ వారి బడ్జెట్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయా పనులకు సాంకేతిక, పరిపాలనా అనుమతులు మంజూరైన తర్వాత రోడ్లు, వంతెనల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, డివిజనల్ ఇంజనీర్ డీవీఎస్ వర్మ, జలవనరుల శాఖ డీఈ బి.శ్రీనివాసరావు, వివిధ శాఖల ఇంజనీర్లతో పాటు డ్రైనేజీ డివిజనల్ ఇంజనీర్ వీఎస్ కిశోర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోతకు వచ్చిన వరి పంటను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో పాటు కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి లైన్ డిపార్టుమెంట్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. కస్టోడియన్ అధికారులు వాహనాల యూనిట్ అధికారులుగా వ్యవహరిస్తూ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ సకాలంలో చేపట్టాలన్నారు. ప్రతీ వాహనానికి తప్పనిసరిగా జీపీఎస్ కోఆర్డినేట్స్ ఉండాలన్నారు. తుఫాను సంభవిస్తే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ధాన్యం తడిసి పాడవకుండా మార్కెటింగ్, సహకార శాఖ అధికారులు టార్పాలిన్లను సమకూర్చాలన్నారు. 48 గంటల్లో ధాన్యం సొమ్ములు రైతు ఖాతాకు జమ కావాలన్నారు. జిల్లా రవాణాధికారి అవసరమైన వాహనాలను సమకూర్చాలని చెప్పారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పదవుల పండుగ

జిల్లాలో పలువురికి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా కంకటాల



ఉప్పలగుప్తం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమనపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కంకటాల రామం నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రామంకు పదవి పట్ల కూటమి పార్టీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

అగ్నికుల క్షత్రియ డైరెక్టర్‌గా భీమరాజు



ఉప్పలగుప్తం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎస్.యానాంకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు లంకే భీమరాజు నియమితులయ్యారు. ఆయన ఎస్.యానాం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. పార్టీలో పదవులు నిర్వహించారు. ప్రస్తుతం అమలాపురం తాలూకా అగ్నికులక్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఉన్నారు. ఆయన నియామకంపై కూటమి నాయకుల హర్షం వ్యక్తం చేశారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కడలి



అల్లవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా అల్లవరం మండలం తూర్పులంక గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు(కేవీ)ను నియమించారు. డైరెక్టరుగా కేవీ నియామకం పట్ల అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, వేగిరాజు వెంకట్రాజు, గుబ్బల నాగేశ్వరరావు, గెద్దాడ శ్రీనివాసరావు, కడలి విజయ్, కడలి రామకృష్ణశెట్టి తదితరులు అభినందనలు తెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుబ్బల



రాజోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజోలు మండలం పొన్నమండకు చెందిన గుబ్బల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈయన గతంలో పొన్నమండకు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఈయన రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పార్టీ నియమించడం పట్ల గుబ్బల శ్రీనివాస్ అసంతృప్తిగా ఉన్నారు. తనకు సరైన పదవి దక్కలేదని అసహనం వ్యక్తం చేశారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేతా శ్రీను



రావులపాలెం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన కేతా శ్రీను రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా పార్టీ గెలుపునకు కృషిచేశారు. దీంతో ఆయనకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అవకాశం లభించింది. కేతా శ్రీను నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, డైరెక్టర్ కేతా శ్రీనుకు టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, కొత్తపేట నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్‌తో పాటు పలువురు నాయకులు అభినందనలుతెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జయబాబు



కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండపేట నియోజకవర్గం, కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన గుడాల జయబాబుకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. ఈయన గతంలో 12 సం.రాల పాటు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళవారం తనకు ఈ పదవి లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు జయబాబు కృతజ్ఞతలు తెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెదబాబు



అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అంబాజీపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బొంతు గంగాధర్ (పెదబాబు) నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. పెదబాబు టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తనకు పదవి కేటాయించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారిసుబ్రహ్మణ్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ పదవికి ఎంపిక కావడంపై ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

'నీటిపారుదల' డైరెక్టర్‌గా శిరిగినీడి



అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా మాచవరానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రుల నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లులు రాక ఆగిన రివిట్‌మెంట్ పనులు

నదీగర్భంలో కలిసిపోతున్న భూములు



ఐ.పోలవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు విడుదల చేయనందున గోదావరి గట్టు రివిట్‌మెంట్ పనులు నిలిచిపోయాయి. గోదావరి గట్టు కోతకు గురికావడంతో వేలాది ఎకరాల విలువైన కొబ్బరి తోటలు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. నదీకోత నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో తీరం వెంబడి ఉన్న భూములు కళ్లెదుటే కనుమరుగవుతున్నాయి. ఎదుర్లంక వద్ద గోదావరి గట్టు నదీకోత నివారణకు గత ప్రభుత్వం రూ.79.96 కోట్లు మంజూరు చేసింది. సకాలంలో బిల్లులు ఇవ్వరన్న స్వీయ అనుభవంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. చివరకు ఎస్ఆర్ కనస్ట్రక్షన్ సంస్థ ముందుకు వచ్చి పనులు ప్రారంభించింది. 1300 మీటర్ల మేర రివిట్మెంట్ పనుల చేపట్టేందుకు అంగీకరించిన సంస్థ 400 మీటర్ల వరకు పనులు చేసింది. అనంతరం గోదావరికి వరదలు రావడంతో జూలైలో పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు బండరాయి కొరత ఏర్పడింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో రివిట్మెంట్ నిలిచిపోయింది. దీంతో గోదావరి కోతకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఫలితంగా విలువైన కొబ్బరి తోటలు నదీగర్భంలో కలిసిపోతున్నాయి. యానాం వైపు గట్టుకు పుదుచ్చేరి ప్రభుత్వం రివిట్మెంట్ పూర్తి చేయడంతో గోదావరి అలల తాకిడి ఎదుర్లంక వైపునకు ఎక్కువగా ఉండి క్రమంగా గట్టు కోతకు గురవుతోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగడంతో వేలాది ఎకరాల కొబ్బరి తోటలు అదృశ్యమై రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే ప్రాంతంలో గతంలో లంక భూములు ఎస్సీలకు పట్టాలుగా ఇచ్చారు. నదీకోత వల్ల పట్టాదారులంతా నష్టపోయారు. గోదావరి గట్టు రివిట్మెంట్‌కు ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. నదీ కోతను విస్మరిస్తే ఐలెండ్‌కు పెనుముప్పు తప్పదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగి లేకపోవడంతో ఆయన స్వగ్రామం ఎదుర్లంక భూములకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఆయన ఉంటే పరిస్థితి ఇంకోలా ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అమలాపురం ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గోదావరి గట్టు రివిట్మెంట్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూమి నీటిపాలు



ఇందిరాగాంధీ హయాంలో ఎదుర్లంక రామాలయంపేట ఎస్సీలకు 72 మందికి 72 ఎకరాలు ఇచ్చారు. గోదావరి కోత వల్ల భూములు నీటిపాలయ్యాయి. లబ్ధిదారులు భూమి లేని పేదలుగా మిగిలిపోయారు. ప్రస్తుత పాలకులు రివిట్మెంట్ పూర్తిచేయిస్తారని ఆశాభావంతో ఉన్నాం.

జనిపెల్ల శ్రీరాములు,
సొసైటీ చైర్మన్

చెగోడీలకో.. ఊరు!



ఊరు పేరుమార్చిన ఉపాధి

కాకినాడ కాజ.. తాపేశ్వరం..కాజ..
ఆత్రేయపురం..పూతరేకులు..
రావులపాలెంలో కుండ బిరియానీ..
కండ్రిక కోవా.. పాలకొల్లు పెసరట్టు..
ఇలా ఒక్కో ఊరు ఒక్కో దానికి ప్రసిద్ధి..
మరి చెగోడీలకు.. చెగోడీలకు ఒక
ఊరుందా అని ఆశ్చర్యపోతున్నారా..!
అవును ఉంది..అదెక్కడో కాదండోయ్..
మన కోనసీమ జిల్లాలోని కపిలేశ్వర
పురంలో.. పేరు నారాయణ లంక..
లంక గ్రామమైనా.. చెగోడీల లంకగా ప్రసిద్ధి
చెందింది.. ఒకసారి ఆ ఊళ్లోకి వెళదాం..
వారేం చేస్తున్నారో చూద్దాం..!

- చెగోడీలకు కేరాఫ్ నారాయణలంక
- కపిలేశ్వరపురంలో ఓ కుగ్రామం
- 25 కుటుంబాలకు జీవనాధారం
- ఉద్యాన పంటల నుంచి ఉపాధి వైపు
- ఆర్డర్ల మేరకు సరఫరా
- రోజూ వందల కిలోల తయారీ
- హైదరాబాద్‌లోనూ డిమాండ్

కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అదొక లంక గ్రామం.. గోదావరి గలగలలతో.. ఆహ్లాదకరమైన వాతావరణంలో అక్కడి ప్రజలు ఒకప్పుడు ఉద్యానపంటలపైనే ఆధారపడి జీవించేవారు.కానీ కాలం మారింది. ఖర్చులు పెరిగాయి.దీంతో పల్లెల్లో కుటుంబాలు పంటల నుంచి వంటల వైపు అడుగులు వేస్తున్నాయి. ఒకరికి ఒకరు తోడై నోరూరించే చిరుతిళ్లు తయారు చేసి విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు.ఇలా ఆ గ్రామం చెగోడీ, జంతికల తయారీకి కేంద్రంగా మారి కొందరికి ఆదాయ వనరుగా నిలుస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం..



చెగోడీల తయారీ విధానం

ఇక్కడి గ్రామస్తులు చెకోడీ తయారు చేసే విధానం ఇలా ఉంది. వరిపిండి, శనగపిండి ఉడకబెట్టి మిషన్‌లో వేసి ముద్దగా అయిన తర్వాత దాన్ని గంటసేపు వరకూ నానబెడతారు. ఆ తర్వాత దాన్ని ఉండలుగా చేస్తారు. శనగపప్పును శుభ్రంగా కడిగి ఆరబెడతారు. నానబెట్టిన పిండిని ఉండలుగా చేసి పిండిని పొడవుగా తయారు చేస్తూ గుండ్రంగా చుట్టి వాటిపై శనగపప్పును అద్దుతారు. ఆపై కళాయిలో నూనె వేడెక్కిన తర్వాత వాటిని అందులో వేసి వేపుతారు. వేడి తగ్గిన తర్వాత వాటిని ప్యాకింగ్‌లు చేసి అమ్మకాలు సాగిస్తుంటారు.

15 ఏళ్లుగా చెగోడీల తయారీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలో నారాయణలంక లంక గ్రామం ఉంది.గోదావరికి ఇటుపక్క కపిలేశ్వరపురం, అటు పక్క నారాయణలంక ఉన్నాయి. కొత్తపేట-ముక్తేశ్వరం రహదారిని చేర్చి ఉన్న గ్రామంలో ఒకప్పుడు కేవలం ఉద్యాన వ్యవసాయమే జీవనాధారం. కానీ 15 ఏళ్లుగా చెగోడీల తయారీతో గ్రామం ప్రసిద్ధి గాంచింది.ఈ గ్రామంలో 289 నివాసాలు ఉన్నాయి. 1200 మంది జనాభా ఇందులో 656 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అత్యధిక ప్రజలు లంకగ్రామంలోనే ఉన్నారు.

నష్టాలతో మూసివేత

జీవితం అన్నాక ఒడిదుడుకులు.. వ్యాపారం అన్నాక లాభనష్టాలు సహజం.. ఇక్కడ వీళ్లదీ ఇదే పరిస్థితి.. ఎన్నో ఏళ్లుగా చెగోడీల తయారీకి ప్రసిద్ధిగాంచిన ఈ గ్రామంలో తయారీదారులకు ఒక్కోసారి కష్టాలు తప్పడంలేదు. చిన్న పరిశ్రమగా పదుల సంఖ్యలో కుటుంబాలు సొంతంగా వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ నష్టాల బాట పట్టి కొందరు ఈ రంగాన్ని వీడారు. పెట్టుబడులు ఎక్కువైపోవడం,నిత్యావసర ధరలు, వ్యాపారం సరిగ్గా జరగకపోవడం వంటి కారణాలతో కొందరు తయారీ ఆపేశారు.



ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం



రూ.3లక్షల ఖర్చుతో ఐదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని ప్రారంభించా. మా కుటుంబీకులు 10మంది పనిచేస్తున్నారు. ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం. రోజుకు 70 కిలోల సరుకు తయారు చేస్తాం. కిలో రూ.130కు విక్రయిస్తాం. లాభాలు అంతంత మాత్రమే.

-సుంకర కోటేశ్వరరావు, నారాయణలంక

ఆశించిన మేర లాభాల్లేవు



వ్యాపారాన్ని 3 నెలల క్రితం ప్రారంభించా. మా కుటుంబమంతా కష్టపడి పని చేస్తున్నాం. తయారు చేసిన సరుకును హైదరాబాద్‌కు పంపిస్తాం. రోజుకు 60 కిలోల సరుకు తయారు చేసి కిలో రూ.140కు సరఫరా చేస్తాం.ఆశించిన మేర లాభాల్లేవ్.

- ఎస్.నాగబాబు, నారాయణలంక

ఎనిమిదేళ్లుగా వ్యాపారం



ఎనిమిదేళ్ల కిందట జంతికల వ్యాపారం ప్రారంభించా. ఐదు కిలోలతో ప్రారంభించిన ఈ వ్యాపారం ప్రస్తుతం 30 కిలోలకు పెరిగింది. సమీపంలోని షోడా, కిరాణా షాపులకు సరుకు తీసుకువెళ్లి వేస్తాం. వచ్చిన సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నాం.

- కుప్పాల నాని, నారాయణలంక



దూరప్రాంతాలకు సరఫరా

నారాయణలంక గ్రామస్తుల వ్యాపార ఆలోచన లంక గ్రామానికి బయటవారితో పెనవేసుకుపోయేలా చేసింది. గ్రామంలో దాదాపు 25 కుటుంబాల వారు తమ ఇళ్లల్లోనే చెగోడి, జంతికలు తయారు చేస్తున్నారు. వీరి మార్కెట్ అంతా లంక గ్రామాలకు బయట ఉన్న గ్రామాలతోనే ముడిపడిఉంది.తయారు చేసిన సరుకును వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్ల ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యాపారం సాగిస్తున్నా రు.కొంతమంది హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా గ్రామంలో 15 ఏళ్లుగా చెగోడీ తయారు చేస్తూ జీవనోపాధి పొందుతూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

వైకల్యాన్ని బాస్కెట్‌లో.. పడేశాడు!



పట్టుదలతో జయించాడు: బాస్కెట్ బాల్ ఆడుతున్న బధిర దివ్యాంగ యువకుడు ఏసుకుమార్

అన్నీ అవయవాలు సరిగ్గా ఉంటేనే చాలా మందికి ఆటలు ఆడేందుకు సమయం ఉండదు.. అతను అలా కాదు.. దివ్యాంగత్వం ఉన్నా కఠోర శ్రమతో జయించాడు.. వైకల్యాన్ని బాస్కెట్‌బాల్‌తో ఆడేస్తున్నాడు.. అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభ చాటేందుకు ఇటీవల ఆస్ట్రేలియా కూడా వెళ్లి వచ్చిన ఈ పిఠాపురం కుర్రాడికి గురించి తెలుసుకుందాం...

ఆటతో వైకల్యాన్ని జయించాడు..

- వృత్తి వెల్డింగ్.. ప్రవృత్తి బాస్కెట్ బాల్..
- రాష్ట్ర, జాతీయస్థాయిలోపదికి పైగా బహుమతులు
- అంతర్జాతీయ పోటీల్లో సైతం పాల్గొన్న యువకుడు



వెల్డింగ్ పనిచేస్తూ..



పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అతడి ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాలేదు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అన్నింటా ముందడుగు వేశాడు. తండ్రి మరణించి కుటుంబపోషణ భారమంతా తనపై పడినా ఆటపై మక్కువ వీడలేదు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూనే బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించడమే కాదు...రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పదికి పైగా బహుమతులు సాధించి ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వచ్చాడు. పిఠాపురం పట్టణానికి చెందిన ఉమ్మిడి ఏసుకుమార్ మూగ, చెముడు సమస్యతో బాధపడుతూ బీకాం వరకూ చదువుకున్నాడు. అయినా ఉద్యోగం రాక వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి వెంకటలక్ష్మితో కలిసి నివసిస్తున్నాడు. పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదివిన ఏసుకుమార్‌కు ఆ సమయంలోనే బాస్కెట్ బాల్‌పై ఆసక్తి కలిగింది. అక్కడే ఉన్న క్రీడామైదానంలో శిక్షణ పొందుతూ ఆటపై పట్టు సాధించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో బహుమతులు సాధించాడు.

ఉభయ రాష్ట్రాల నుంచి ఒక్కడే ..

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ వచ్చిన ఏసుకుమార్ తన ఆట ద్వారా దేశానికి పేరు తీసుకురావాలనే దృఢసంకల్పంతో ముందడుగు వేశాడు.2016లో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ చాంపియన్‌షిప్ జనరల్ కేటగిరీ విభాగంలో పాల్గొని తొలి బహుమతి సాధించాడు. అక్కడి నుంచి ఏసుకుమార్ పాల్గొన్న ప్రతి పోటీలోనూ రాణిస్తూనే ఉన్నారు. 2017లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో, 2018లో రాష్ట్ర జూనియర్ చాంపియన్‌షిప్, 2022లో జరిగిన స్టేట్ సీనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జట్టును ప్రథమస్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. 2022లో బెంగళూరులో జరిగిన బధిరుల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో డఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ (డీఐబీఎఫ్) ఆధ్వర్యంలో ఆసియా, పసిఫిక్ దేశాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడు.ఈ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత సహకరించకపోవడంతో దాతలు సహకరించారు. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న పోటీలకు దేశవ్యాప్తంగా 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏసుకుమార్ ఒక్కరే ఎంపికవడం అతడి ప్రతిభకు నిదర్శనం. తమిళనాడు నుంచి ఆరుగురు, కర్నాటక నుంచి ముగ్గురు, ఒడిసా నుంచి ఒకరికి అవకాశం లభించింది.

అతడి ఏకాగ్రతే ఈ స్థాయికి చేర్చింది

ఆటలో చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసమే ఏసుకుమార్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. ఏ నాడు తనకు ఉన్న లోపాన్ని తలచుకుని బాధపడకుండా సాధారణ క్రీడాకారులతో పోటీపడుతుండడమే అతడ్ని ఇంతవాడ్ని చేసింది.

- బొజ్జా మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి తొలి నామినేషన్ దాఖలు

- పీడీఎఫ్ అభ్యర్థిగా గోపి మూర్తి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ధర్నాచౌక్ రోడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన వెంటనే షేక్‌సాబ్జీ ఆశయాలను సాధించడానికి నిరంతరం పనిచేస్తానన్నారు. పీడీఎఫ్ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, శ్రామికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. అనంతరం ఈ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణ, గుంటూరు పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా గోపిమూర్తిని మొదటి ప్రాధ్యానం ఓటు వేయించి భారీ మెజారిటీతో గెలిపించి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయబ్రహ్మం, యూటీఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బరావమ్మ, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



పీడీఎఫ్ అభ్యర్థిగా ఉప్యాధాయ ఎమ్మెల్సీకి నామినేషన్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న గోపిమూర్తి

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల



రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతి సచివాలయంలో తూర్పు-పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను రాజశేఖర్ వివరించారు. ఉభయగోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మం త్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జిల సహకారంతో ఓటరు నమోదు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు జరుగుతుందని తెలిపారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి త్రీడీ విగ్రహం

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు సూక్ష్మ చిత్ర కళాకారుడు. పట్టణంలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక మిల్లీ గ్రాము బంగారం, మిల్లీమీటర్ సైజులో చిన్న సైజు సూది రంధ్రంలో పట్టే విధంగా 3డీ విగ్రహాన్ని సోమవారం తయారుచేసి స్వామి వారికి సమర్పించారు.



బాలనాగేశ్వరరావు తయారు చేసిన వీరబ్రహ్మేంద్రస్వామివారి 3డిచిత్రం

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.80లక్షలు

ఆత్రేయపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,80,584 లభించినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

- కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక బుధవారం క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా గోదావరినదీలో సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ సీఎం జగన్ ఫొటోతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ

- కాకినాడలోని గొడారిగుంటలో మీసేవా కేంద్రం నిర్వాహకుడి నిర్వాకం
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం

సర్పవరం జంక్షన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలు కావస్తోంది. కానీ, ఇప్పుడు జగన్ ఫొటోతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఓ విద్యార్థి ఇన్‌కమ్ సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే.. మాజీ సీఎం జగన్ ఫొటోతో ముద్రించి ఉన్న సర్టిఫికెట్ జారీ చేయడంతో ఆ విద్యార్థి విస్తుపోయాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన గురుజు లోహిత్ సాయి కుమార్ విద్యాభ్యాసం కోసం ఇన్‌కం అండ్ అసెట్ సర్టిఫికెట్(ఈడబ్ల్యూఎస్) కోసం కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్ గొడారిగుంటలోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 10న ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 24-25 సంవత్సరానికి చెల్లుబాటు అయ్యేలా కాకినాడ రూరల్ తహశీల్దార్ సిస్ట లక్ష్మీ నరస కుమారి డిజిటల్ సంతకంతో సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సర్టిఫికెట్‌ను మాజీ సీఎం జగన్ ఫొటోతో జారీ చేయడాన్ని గుర్తించి మీసేవా నిర్వాహకుడ్ని అడిగాడు. ఏం పర్వావాలేదు.. కొత్త సర్టిఫికెట్లు అయిపోయాయి. పాత సర్టిఫికెట్‌తో ఇచ్చేశా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆ బాలుడు విస్తుపోయాడు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా మాజీ సీఎం జగన్ ఫొటోతో సర్టిఫికెట్ జారీ చేయడాన్ని విద్యార్థి తప్పుపట్టాడు. దీనిపై కాకినాడ రూరల్ తహశీల్దార్ కుమారిని వివరణ కోరగా మీసేవా కేంద్రాల నిర్వహణ కలెక్టర్ కంట్రోల్ ఉంటుందని తెలిపారు. ఈ విషయమై తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు లేఖ రాశానని తెలిపారు.



మీ సేవా నిర్వాహకులు జారీ చేసిన ఇన్‌కమ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

- విజేతలుగా నిలిచిన తూర్పుగోదావరి బాలికల జట్టు



అండర్ 19, 17 బాలుర, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్ - 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లాల జట్లు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. కాగా అండర్ 19 బాలుర విభాగంలో విశాఖపట్నం జట్టు, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు, అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. అదేక్రమంలో అండర్-19 బాలుర విభాగంలో తూర్పుగోదావరి, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు అధికారులు ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.గోపాల్, ఆర్ఐపీఈ షేక్ మహబూబ్‌బాష, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనంతలక్ష్మీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య, పీడీలు ఎన్ ప్రభాకర్‌రెడ్డి, పీ థామస్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మేమున్నాం..

- మహిళా రక్షక్ టీం ర్యాలీ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ఎస్పీ నరసింహ కిషోర్ ఏర్పాటుచేసిన మహిళా రక్షక్ టీం ప్రతిక్షణం సిద్ధమని శాంతిభద్రతల విభాగం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. ఆయన పర్యవేక్షణలో సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రక్షక్ టీం పోలీసులు ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏపీఏ రోడ్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోటిపల్లి బస్టాండ్, దేవీచౌక్ గుండా మహిళా పోలీస్ స్టేషను వరకూ ఈ ర్యాలీ సాగింది. మహిళల్లో ధైర్యాన్ని నింపి వారికి పోలీసు లు అండగా ఉంటారని భరోసా కల్పించడానికి, వారిపై దాడులను అరికట్టడానికి ఈ అవగాహనా ర్యాలీ చేపట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు.



మహిళా రక్షక్ టీం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పంట కాలువలోకి వెళ్లిపోయిన కారు

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఆత్రేయపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం ప్రధాన కాలువలోకి మంగళవారం ఉదయం ఓ కారు దూసుకెళ్లింది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వైపు వస్తున్న కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే స్పందించారు. అక్కడకు వచ్చి కారును బయటకు తీశారు. దీంతో అందులో వున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.


భీమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న అఘోరీ

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అఘోరీ

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి అఘోరీ సోమవారం రాత్రి ప్రత్యేక వాహనంలో చేరుకుంది. ఆలయ తలుపులు మూసివేసినందున తెల్లవారుజామున రావాలని అధికారులు, పోలీసులు సూచించారు. దీంతో ఆమె మంగళవారం తెల్లవారుజామున ఎరుపు వస్త్రం ధరించి ఆలయంలోకి ప్రవేశించింది. తనదైన శైలిలో భీమేశ్వర స్వామిని ప్రార్థించి వెనుదిరిగింది. మహిళా పోలీసులతో బందోబస్తు చేపట్టారు. అఘోరీతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.


పంపా సరోవరంలో సత్యదేవుని విహారానికి సిద్ధం చేసిన హంస వాహనం

నేడు సత్యదేవుని తెప్పోత్సవం

సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న తులసిధాత్రి పూజ

రాత్రి ఏడు గంటలకు హంస వాహనంపై పంపా సరోవరంలో విహరించనున్న స్వామి, అమ్మవార్లు

ఏర్పాట్లు పూర్తి చేసిన అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి జరిగే వార్షిక వేడుకల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన స్వామివారి తెప్పోత్సవం నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రతిఏటా క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన ఈ వేడుక నిర్వహిస్తారు. ఇప్పటికే హంస వాహనాన్ని ముస్తాబు చేశారు. తులసిధాత్రి పూజ జరిపేందుకు పంపా తీరం వద్ద వేదికను సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు రత్నగిరిపై నుంచి స్వామి, అమ్మవార్లను, క్షేత్ర పాలకులైన సీతారాములను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కొండ దిగువన పంపా సరోవరం వద్దకు తోడ్కొనివచ్చి తులసిధాత్రి పూజ చేస్తారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లకు పంపా సరోవరంలో ముమ్మారు ప్రదక్షిణ గావిస్తారు. ప్రముఖులెవ్వరూ కాకుండా వైదిక బృందం మాత్రమే హంసవాహనం ఎక్కేందుకు చర్యలు చేపట్టారు. ప్రముఖులు వీక్షించేందుకు తీరం ఒడ్డున ప్రత్యేక వీఐపీ గ్యాలరీ ఏర్పాటుచేస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చే ప్రజలు ప్రత్యక్షంగాను, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులు పరోక్షంగాను వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫైర్, అంబులెన్స్ వాహనాలు, గజ ఈతగాళ్ళు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో సుమారు 100 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధి కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రద్దీగా మారింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. వేకువజామున నాలుగు గంటలకే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సుమారు 6వేల జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించుకోగా స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.65 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుమారు 30వేల మంది భక్తులకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్నదాన విభాగం ఏఈవో బి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్లలో వేచియుండాల్సి వచ్చింది.



తులసిధాత్రి పూజకు సిద్ధమవుతున్న వేదిక, స్వామి దర్శనం కోసం వేకువజామున నాలుగు గంటలకు క్యూలైన్లలో వేచియున్న భక్తులు



జేగురుపాడులో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్లు, పొట్టిలంకలో ఓ వీధిని శుభ్రపరుస్తున్న ట్రైనీ కలెక్టర్లు

యువ కలెక్టర్ల పల్లె బాట

కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంకల్లో క్షేత్ర స్థాయి పర్యటన... సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులు పరిశీలన

కడియం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు చెందిన పది మంది ట్రైనీ కలెక్టర్లు రెండు రోజుల క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా మంగళవారం తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలో పర్యటించారు. రెండు బృందాలుగా ఏర్పడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులను పరిశీలించారు. ఓ బృందం జేగురుపాడు గ్రామాన్ని సందర్శించగా మరో బృందం పొట్టిలంకలో పర్యటించింది. జిల్లా, మండల స్థాయి అధికారులు వారి వెంట ఉండి ఏఏ పథకాలు ఎలా అమలవుతున్నాయో ప్రత్యక్షంగా చూపించారు. తొలుత జేగురుపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన అనురాగ్ బాబెల్ (టీమ్ లీడర్), ప్రియారాణి, ఎస్.బేగం, పారత్, కె.భక్తి బృందానికి సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ స్వాగతం పలికారు. అక్కడ చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పరిశీలించారు. వాటి పనితీరును జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డీఆర్డీఏ పీడీ మూర్తి, ఎంపీడీవో రమేష్, ఏవో సుబ్బారావు, ఈవోపీఆర్డీ రాంప్రసాద్ వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఏ విధంగా సహకారం అందిస్తున్నామో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు డిజిటల్ బోర్డు ద్వారా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులు, గర్భిణులకు ఆహారాన్ని ఎలా అందిస్తున్నారో పీడీ కె.విజయకుమారి ద్వారా తెలుసుకున్నారు. పిల్లలకు పెడుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఈ బృందానికి డాక్టర్ జ్యోత్స్న గ్రామ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. అనంతరం సచివాలయానికి చేరుకుని ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించి విద్యా విధానంపై ఆరా తీశారు. డ్వాక్రా మహిళలతో సమీక్షించి రుణ సదుపాయం, వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాల వివరాలను డిజిటల్ స్క్రీన్‌పై ఆయా శాఖల అధికారులు ట్రైనీ కలెక్టర్లకు వివరించారు.

పొట్టిలంకలో ట్రైనీ కలెక్టర్లు నిరంజన్ జయదేవరావు (అసిస్టెంట్ టీమ్ లీడర్), టి.నాగి, ఎ.మిశ్రా, స్నేహ పన్నా పర్యటించారు. వారికి సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. డీఎల్డీవో వీణాదేవి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుజాతకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ టీవీఎస్ రెడ్డి, సీడీపీవో కనకవల్లి బృందం వెంట ఉండి ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను వివరించారు. స్థానికులు, లబ్ధిదారులతో మాట్లాడించారు.

శిశు మరణాల అడ్డుకట్టకు చర్యలు

చింతూరు డివిజన్ అధికార యంత్రాంగాన్ని కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం


రామన్నపాలెంలో వైద్య శిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న తులసిపాకల పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చోటుచేసుకుంటున్న శిశు మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం వరుస చర్యలు మొదలు పెట్టింది. 'మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు' శీర్షికన ఈ నెల ఏడో తేదీన ఆంధ్రజ్యోతిలో వచ్చిన ప్రత్యేక కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది. గడచిన ఏడు నెలల కాలంలో చింతూరు డివిజన్లో 49 మంది పసికందులు పొత్తిళ్లలోనే కన్నుమూయడం దయనీయం. మాతా, శిశు మరణాలు చోటుచేసుకోకూడదన్నది లక్ష్యం. కాగా ఏడు నెలల వ్యవధిలోనే చింతూరు డివిజన్లో 49 మంది చిన్నారులు మృత్యువాతపడడమన్నది అంత చిన్న విషయమేమీ కాదు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ స్పందించారు. ముందుగా డివిజన్ స్థాయి వైద్యులు, వైద్యాధికారులతో పీవో సమావేశమయ్యారు. డివిజన్‌వ్యాప్తంగా ఇంటింటా సర్వేతో పాటు కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని పీవో ఆదేశించారు. ఏడాదిలోపు వయసున్న చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీసి అవసరమైతే వెంటనే ఆసుపత్రులకు తరలించాల్సిందిగా పీవో ఆదేశించారు. మారుమూలల్లో, గుట్టలపైన గ్రామాలు ఉండి ఉండడంతో సర్వే పూర్తి చేసేందుకు వారం గడువు ఇవ్వాల్సిందిగా వైద్యులు పీవోని కోరారు.

ఇదిలా ఉండగా నాటు వైద్యం కూడా శిశు మరణాలకు ఒక కారణంగా ఉందని వైద్యులు పీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సోమవారం డివిజన్లోని దాదాపు వంద మంది నాటు వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించిన విషయం విదితమే. మొత్తంగా పది పీహెచ్‌సీలకు చెందిన 20 మంది వైద్యులు, సిబ్బంది రంగంలోకి దిగి వారి పరిధిలోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరీక్షిస్తున్నారు.



కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో నెల్లిమెట్ల కాలనీ-నెల్లిమెట్ల గ్రామాల మధ్య కాజ్‌వే ఓ వైపు కొట్టుకుపోయిన వైనంపై 'కాజ్ వేఏదీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు చేశామని, పనులు ప్రారంభమవుతాయని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈ గౌతమి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రజలు, ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక


జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గౌతమి శిక్షణ శిబిరం క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గౌతమి శిక్షణ శిబిరానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని కొవ్వూరు గౌతమి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టులో మానికల మహాలక్ష్మి (జంగారెడ్డిగూడెం), కడియం మహాశ్రీలక్ష్మి (ధర్మవరం), బాలుర జట్టులో పి.నవీన్‌కుమార్ (దుద్దుకూరు), యు.ప్రవీణ్ (కొవ్వూరు) ఉత్తమ ప్రతిభ కనబర్చారు. డిసెంబరు నెలలో ఉత్తరప్రదేశ్‌లోని వారాణసిలో జరిగే జాతీయ పోటీల్లో ఈ నలుగురూ రాష్ట్ర జట్టు తరపున ఆడతారని అసోసియేషన్ కార్యదర్శి కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లు కె.రామ్‌కుమార్, పి.సత్యనారాయణ, ఆర్.సురేష్, పి.గంగాధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో కొడాలి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

పెనుగొండ కళాశాలలో 27, 28 తేదీల్లో
అంతర్జాతీయ తెలుగు సదస్సు

దివాన్‌చెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం, పెనుగొండలోని ఎస్వీకేపీ-డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. 'విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య' అంశంపై పెనుగొండ కళాశాలలో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎస్వీకేపీ కళాశాల కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ వైవీ అప్పారావు, కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడ్డ వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దిమ్మిలి కృష్ణ (36) ఈ నెల 28వ తేదీన సుబాబుల్ చెట్లు నరికే పనిలోకి వెళ్లాడు. చెట్లు నరుకుతూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సూచనలిస్తున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. మంగళవారం ఆమె విద్యుత్, కార్మిక, మునిసిపల్ శాఖల అధికారులు, వినియోగదారుల ఫోరం సభ్యులతో సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆయా శాఖలు, సంస్థల్లో పెండింగులో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్, రాజీకి అర్హమైన అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఉదయం పసుపుకొట్టే కార్యక్రమంలో మహిళలు పాలుపంచుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణాలంకారం జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామి అమ్మవార్ల పాదుకా ప్రక్షాళన గావించారు. గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద లగ్నాష్టకాలు, చూర్ణిక తదితర వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు పట్టు వస్త్రాలు సమర్పించారు. యాజ్ఞిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆలయ అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు, ఆలయ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, రామ్‌మోహన్, మల్యాల గోపాలకృష్ణ, అప్పలరాజు, కొల్లూరి లక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కోర్టులో బైండోవర్
అమలాపురంటౌన్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలానికి చెందిన నాగవరపు కర్ణ, అరిగెల వెంకటరత్నంను తహశీల్దార్ నరసింహారావు కోర్టులో హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీసత్యనారాయణతెలిపారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న పాత నిందితులైన వీరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారు.

ఢిల్లీలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ సదస్సు
మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 9, 10, 11 తేదీల్లో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ జరుగుతుందని రాష్ట్ర ఫొటోగ్రఫర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీవీరావు తెలిపారు. జిల్లా నుంచి పది మంది ఎగ్జిబిషన్‌కు వెళుతున్నారని, ఈసదస్సుకు ఎంపీ గంటిహరీష్ మాధుర్‌ను ఆహ్వానించినట్టు తెలిపారు.

అధ్వానంగా తొత్తరమూడి ఆర్అండ్‌బీ రోడ్డు

● వర్షం వస్తే గోతులన్నీ నీటితో నిండిపోయి తరచూ జరుగుతున్న ప్రమాదాలు ● ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారుల ఇబ్బందులు ● ఐదేళ్ల క్రితం టెండరు పిలిచినా ప్రారంభం కాని పనులు



గోతులతో అధ్వానంగా మారిన ముక్తేశ్వరం-కె.జగన్నాథపురం ఆర్అండ్‌బీ రోడ్డు

అయినవిల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాథపురం వెళ్లే తొత్తరమూడి ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు నిలువెత్తు గోతులతో ప్రమాద భరితంగా మారింది. వర్షం వస్తే గోతులన్నీ నీటితో నిండిపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రావులపాలెం, ముమ్మిడివరం జాతీయ రహదారులను కలిపే స్టేట్ హైవే రోడ్డు దుస్థితిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. రావులపాలెం నుంచి మురమళ్ల వెళ్లే ఆర్టీసీ బస్సులు, కాకినాడ-రావులపాలెం బస్సులు, నిత్యం భారీ రవాణా వాహనాలు ఈ రోడ్డు మార్గానే పయనించాల్సి ఉంది. భారీ వాహనాలు గోతుల్లో పడి ఎక్కడ తల కిందులు అవుతాయోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైతం గోతుల్లో పడి దెబ్బతింటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు జలమయం కావడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డుపై ప్రయాణం నరకయాతనంగా మారడంతో సమీపంలోని కాల్వగట్టు సింగిల్ రోడ్డును స్థానికులు ఆశ్రయిస్తున్నారు. ఐదేళ్ల క్రితం టెండరు పిలిచినా పనులు ప్రారంభించకపోవడంపై ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం కల్పించాలని, తక్షణం గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.

రైల్వేలైన్ కోసం వేగంగా సర్వే


మామిడికుదురులో రైల్వే లైన్ సర్వే పనులు చేస్తున్న రైల్వే సిబ్బంది

మామిడికుదురు, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి నుంచి మొగలికుదురు వరకు ఏర్పాటుచేసే రైల్వేలైను కోసం సర్వే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. సర్వే కోసం మండలంలో 12మంది సభ్యులతో మూడు బృందాలు ఏర్పాటుచేసి మండల సర్వేయర్ వాణి ఆధ్వర్యంలో సర్వే పనులు నిర్వహిస్తున్నారు. పాశర్లపూడి, మామిడికుదురు, పెదపట్నం, గెద్దాడ, మొగలికుదురు గ్రామాల్లో 70మీటర్ల వెడల్పు వంతున, నగరం గ్రామంలో 100మీటర్ల వెడల్పు వంతున రైల్వేలైన్‌ను ఏర్పాటుచేయాలని భూసేకరణ చేయడానికి రైల్వేశాఖ ప్రతిపాదించింది. పాశర్లపూడి గ్రామంలో 55.10 ఎకరాలు, మామిడికుదురులో 15.76, పెదపట్నంలో9.20, నగరంలో 71.65, గెద్దాడలో 7.26, మొగలికుదురులో 23.45 ఎకరాల భూమిని ఆయాగ్రామాల్లో రైల్వేలైన్ నిమిత్తం సేకరించడానికి సర్వే చేస్తున్నారు. మామిడికుదురులో మంగళవారం సర్వే పనులను సచివాలయ సర్వేయర్లు, వ్యవసాయశాఖ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది చేస్తున్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన డీవీ
అంబాజీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ (డీవీ) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆయన మంత్రి లోకేశ్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. కార్పొరేషన్ల ద్వారా ఆయా కులాలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. మంత్రి లోకేశ్ స్పందించి నాలుగు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు డీవీ తెలిపారు.

బాలబాలాజీ స్వామికి లక్ష తులసి పూజ


బాలబాలాజీ స్వామికి తులసీ దళాలతో పూజ

మామిడికుదురు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల తిరుపతిగా వర్థిల్లుతున్న అప్పనపల్లి బాల బాలాజీ స్వామికి కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష తులసీ పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణతో పాటు అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చన ఘనంగా చేశారు. స్వామివారికి బాలబోగ నివేదన, సాయంకాలార్చన, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజలను ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ వైభవంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

భక్త జనం పూజలు
కాట్రేనికోన, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో మంగళవారం అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ర్యాలి వెంకట్రావు, బుజ్జి సోదరుల ఆధ్వర్యంలోఏర్పాటుచేసిన అన్నసమారాధనలో వెయ్యి మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

శివకేశవులు ఆలయంలో లక్ష బిల్వార్చన
అంబాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం కౌశికనదీ తీరాన వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. కాపు మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి, సుదర్శనం కేశవచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభి షేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాచవరం శ్రీపార్వతీరాజేశ్వరి స్వామి ఆలయంలో స్వామివారికి లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు.

క్షీరాబ్ది ద్వాదశికి ఏర్పాట్లు
అంతర్వేది, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం నుంచి స్వామివారు పల్లకీపై అంతర్వేది పల్లిపాలెం చేరుకుని ద్వాదశి మండపంలో ఆశీనులవుతారు. బుధవారం జరిగే ఈ క్షీరాబ్ది ద్వాదశి మండపాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం వశిష్ఠ గోదావరిపై స్వామి-అమ్మవార్లతో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈద్వాదశి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తెప్పోత్సవాన్ని వీక్షించాలని కోరారు.

వైభవంగా లక్ష బిల్వార్చన
ఉప్పలగుప్తం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మునిపల్లి పార్వతీమల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. కల్వకొలను దుర్గాప్రసాద్, వాసవినాగదుర్గ, వర్రే కార్తీకమణికంఠనాయుడు, రమాదేవి దంపతుల నిర్వహణలో బాదంపూడి సత్యనారాయణశర్మ (కాసు) ఆధ్వర్యంలో కొమాళ్లపల్లి కాశీవిశ్వనాథం సారథ్యంలో శ్రీకంఠం వినాయకశర్మ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నిమ్మకాయల వీరాంజనేయులు, కుమారులు గోపాలరావు, నీలిమ, సత్యనారాయణ, ఉమాదేవి దంపతుల సహకారంతో అన్న సమారాధన జరిగింది.

ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం


ఇందుపల్లిలో ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురంరూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు అండర్-17 సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ వేడుకలకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, సర్పంచ్ చొల్లంగి శివాళినీ అప్పాజీ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందిన రేలంగి నాగకుమార్, భమిడిపాటి అప్పాజీలను ఘనంగా సత్కరించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అడబాల విజయ్‌శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి బీవీఎస్ఎన్ మూర్తి, మేడిశెట్టి గణపతి రామారావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, డీఎస్‌డీవో పీఎస్ సురేష్‌బాబు, క్రీడాభారతి అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, వ్యాయామ ఉపాధ్యాయ జోన్ అధ్యక్షుడు వైఎస్‌వీ రమణారావు, కార్యదర్శి తోట రవి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, కామన గణేశ్వరరావు, లంక జార్జ్, జి.సునీల్ పాల్గొన్నారు. అండర్-17 బాలబాలికల పవర్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.

పది విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రత్యేక ప్రణాళిక


ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం అడుగు వేస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందించాలన్నారు. అదనపు తరగతుల నిర్వహణలో ప్రధానంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. గణితంపై విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా, ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

21న కృష్ణమాదిగ రాజమహేంద్రవరం రాక


మందకృష్ణమాదిగ జిల్లా పర్యటన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఈనెల21న రాజమహేంద్రవరం బహిరంగ సభకు హాజరవుతున్నారని అమలాపురం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుమర్తి రమేష్‌మాదిగ తెలిపారు. రోళ్లపాలెంలో మంగళవారం నేదునూరు నతానియేలు స్వగృహం వద్ద కృష్ణమాదిగ పర్యటన పోస్టర్, కరపత్రాలను ఆయన ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రామకృష్ణ, మండల శాఖల ప్రతినిధులు సత్తాల దుర్గారావు, యార్లగడ్డ రామకృష్ణ, చుట్టుగుళ్ల నీలకంఠం, గంపల సత్యప్రసాద్, ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టుగుళ్ల సత్యనారాయణ, కొడమంచిలి కృష్ణ, తొత్తరమూడి రాము తదితరులు పాల్గొన్నారు. పేరూరు ఇందిరా కాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖండవెల్లి లోవరాజు, ఉపాధ్యక్షుడిగా నేదునూరి దుర్గారావు, యువసేన అధ్యక్షుడిగా ముమ్మిడివరపు గణేష్, ఉపాధ్యక్షుడిగా గిడ్ల దుర్గాప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుడిమెళ్లంక విద్యార్థులు


విజేతలను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా తదితరులు

మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్లకంబ జాతీయ స్థాయి పోటీలకు గుడిమెళ్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్వీ సుబ్బారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చింతలపూడి బాపిరాజు మెమోరియల్ హైస్కూలు భీమవరం, పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన అంతర్‌జిల్లాల పోటీల్లో గుడిమెళ్లంక విద్యార్థులు అండర్-14 విభాగంలో కె.దేవి, కె.నీలిమాదీప్తి, డి.మురారిదివ్య, కె.తనూజ్, ఆర్.సూర్య, అండర్ 17లో కె.టైటస్, ఎ.రాము విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. డిసెంబరు 8 నుంచి 15వరకు మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీని కలిసిన రామం
అమలాపురంటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కంకటాల రామం మంగళవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక స్థితి మెరుగుపడడంతో.. కుటుంబ సభ్యులకు అప్పగింత
ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో కాట్రేనికోనకు చెందిన ధర్మాడి ఏసుబాబుకు వైద్యసేవలు అందింపచేసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ధర్మాడి ఏసుబాబు మతిస్థిమితం లేక గ్రామంలో పిల్లలు, మహిళలను రాళ్లతో కొడుతూ ఇబ్బంది పెట్టేవాడు. వీరితోపాటు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేసేవాడు. ఈవిషయం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా దృష్టికి రావడంతో కాట్రేనికోన పోలీసులు ద్వారా ధర్మాడి ఏసుబాబును రప్పించి ముమ్మిడివరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయించారు. అతని మానసిక స్థితి సక్రమంగా లేదని వైద్యులు ధ్రువీకరించడంతో విశాఖపట్నం హాస్పిటల్ ఫర్‌మెంటల్ హెల్త్‌కేర్‌కు పంపించారు. అక్కడ చికిత్స అనంతరం మానసిక పరిస్థితి మెరుగు పడినట్టు జడ్జి రహ్మతుల్లాకు తెలియచేయడంతో ఏసుబాబును మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్టీఐ చట్టంపై అవగాహన
మలికిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): లక్కవరంలో ఆర్టీఐ 2005 సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. అధికారుల నుంచి సమాచారం పొందే హక్కు ప్రతీ పౌరునికి సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించారని డాక్టర్ పీఎస్ రాజు తెలిపారు. రైతులకు పలు సమస్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో వ్యవసాయాధికారి రాకేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక
యానాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బుద్ధాపార్కులో నిర్వహించిన సమావేశంలో అంబేద్కర్‌నగర్ ఎస్సీ ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సికిలే జయరాం, ఉపాధ్యక్షుడిగా యాళ్ల మీరయ్య కార్యదర్శి కొట్నాల రోహిత్, సభ్యులుగా ఎలిపే కోటేశ్వరరావు, పెట్ల హరిబాబు, సబతి కృష్ణ ఎన్నికయ్యారు.

కంటి వైద్య శిబిరం
అల్లవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఎడాప్ట్-ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ (యూఏస్ఏ) ఆర్థిక సాయంతో రాజుపాలెం క్షత్రియ సేవా భవనంలోవైద్య శిబిరం నిర్వహించారు. 200మందికి కంటి పరీక్షలు జరిపి 104మందికి కళ్లజోళ్లు అందజేశారు. క్షత్రియ సేవా సమితి ప్రముఖులు, ఫౌండేషన్ కన్వీనర్ దాట్ల గోపిరాజు, ఆర్.బంగార్రాజు, మంతెన సురేష్‌రాజు, ఎం.శ్రీనురాజు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరునికి అన్నాభిషేకం

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపమని, పరమాత్మకు ప్రీతి పాత్రమని వేదాలు స్పష్టం చేశాయని అటువంటి అన్నంతో ఇష్ట దైవాన్ని ఆరాధించడమే అన్నపూజ అని ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్ట నాగాదిత్య చెప్పారు. పవిత్ర కార్తీకమాసం ఏకాదశి మంగళవారం అమలాపురం శ్రీభ్రమరాంబికా సమేత చెన్నమల్లేశ్వరస్వామికి ఉపద్రష్ట కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అన్నాభిషేకం నిర్వహించారు. చెన్నమల్లేశ్వరునికి తెల్లవారుజాము నుంచి ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజలను నాగాదిత్య సోదరులు విక్రమాదిత్య, విజయాదిత్య, విమలాదిత్య తదితరులు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సంసానికి రజతం

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం ఎస్‌కేబీఆర్ పీజీ కళాశాల ఎంబీఏ విద్యార్థి సంసాని నాగవెంకటసత్యనారాయణ ప్రతిభచాటి ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంసానిని కళాశాల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, సభ్యులు డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ పెచ్చెట్టి కృష్ణకిశోర్, ఫిజికల్ డైరెక్టర్ ఐ.సురేష్‌కుమార్ అభినందించి సత్కరించారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈనెల14 నుంచి 20వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్ హెచ్‌కే వర్మ తెలిపారు. తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని 14న బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులపై ప్రసంగ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పలు పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవం, 20న ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని వర్మ తెలిపారు.

విశ్వకర్మ యోజన శిక్షణా తరగతులు నిర్వహించాలి
అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకం శిక్షణ తరగతులను జిల్లాలో త్వరితగతిన చేపట్టాలని దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధికల్పన తదితర అంశాలపై చర్చించారు. నాయకులు పితాని బేబిరావు, గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, ముస్కూరి ఏసుబాబు, కముజు సుందరరావు, ముషిణి రామకృష్ణ, గిడ్ల రాంబాబు, ఆకుమర్తి సూరిబాబు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్
ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా అనాతవరానికి చెందిన కముజు శ్రీనివాస్ నియమితులయ్యారు. శ్రీశైలంలో జరిగిన సంఘ రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగళరావు చేతులమీదుగా శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎల్.వెంగళరావులకు మంగళవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల వినియోగంపై అవగాహన
ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ల వినియోగంలో భద్రతా చర్యలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చునని ముమ్మిడివరం శ్రీశాంత్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్ ఎం.త్రినాథ్ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కాశివానితూము సెంటర్‌లోని విశ్వాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గ్యాస్ వినియోగం, గ్యాస్ సేఫ్టీ క్లినిక్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ
ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక రూపకల్పనకు ఈనెల14వ తేదీన ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగుతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు ఉన్న అధికారులకు, మండల స్థాయిలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఈజీఎస్, పశుసంవర్థక, మెడికల్ ఆఫీసర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయశాఖ ఏవో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, వీవో అధ్యక్షులకు, విద్యాశాఖ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమంలో సూచించిన అంశాలను పరిగణలోనికి తీసుకుని గ్రామ పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన సూచించారు.


ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి
ఉప్పలగుప్తం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని తహసీల్దార్ వాసా దివాకర్ విజ్ఞప్తి చేశారు. ఎస్.యానాం, టి.చల్లపల్లి, ఎన్.కొత్తపల్లి, గోపవరం, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, చినగాడవిల్లి, కిత్తనచెరువు సంఘాల ఛైర్మన్ల ఎంపికకు 96మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలింగ్ నిర్వహణపై వివిధ స్థాయిల్లో ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక అధికారులు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు, ఉపాధి సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ మీటరు ఏర్పాటుకు సహాయం
మామిడికుదురు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని ఆల్ క్రాస్ట్ కాలనీకి చెందిన నిరుపేద మహిళ కల్యాణి కోటమ్మ విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడుతోంది. మంగళవారం టీడీపీ రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు విద్యుత్ మీటరుకు అవసరమైన రూ.2500 అందించి ఆమె ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నయినాల సత్యనారాయణమూర్తి, యింటి గణపతి, ముగ్గు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు.. రేపు ఎస్కేబీఆర్ కళాశాలలో జిల్లా జట్లు ఎంపిక
అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 26నుంచి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్టు అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది తాతబాబు, కేతా సాయిదుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లాస్థాయి సబ్ జూనియర్ సెలక్షన్స్ 14వ తేదీ ఉదయం ఏడు గంటలకు అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. సెలక్షన్‌కు హాజరయ్యే క్రీడాకారులు 2010 జనవరి 1 నాటికి 14ఏళ్లు దాటి ఉండాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని హాజరు కావాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బాలబాలికల విభాగాల్లో జిల్లా జట్లకు ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. వివరాలకు సెల్ 8519998997ను సంప్రదించాలన్నారు.

ఆదుర్రు ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు
మామిడికుదురు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, వాస్తుపూజ, వాస్తుబలి, వాస్తు హోమం, ధ్వజమునకు, యంత్రాదులకు పాలాభిషేకం, గ్రామ ప్రదక్షిణ తదితర పూజలను ఘనంగా చేశారు. ధ్వజస్తంభానికి అవసరమైన కర్ర కొనుగోలుకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.2.60లక్షలు విరాళంగా అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 6.54గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలు
మలికిపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ టి.శ్రీనివాసరావు అన్నారు. మట్టపర్రు, విశ్వేశ్వరాయపురంలలో జరిగిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. వందేళ్లకు ముందు జరిగిన సర్వే వల్ల నేడు భూ సరిహద్దుల్లో సర్వే రాళ్ల అనేక కారణాల వల్ల భూ తగాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు వల్ల అధునాతనమైన పరికరాలతో శాటిలైట్ సహాయంతో రైతుల సరిహద్దులను, ప్రభుత్వ భూములను అక్షాంశ, రేఖాంశాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో ఏవిధమైన భూతగాదాలు లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మధుసూదనరాజు, సర్పంచ్‌లు సీహెచ్ హెలీన, కడలి దుర్గాదేవి, గ్రామ సర్వేయర్లు, సెక్రటరీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నికాయిట్‌పోటీలకు గురుకుల విద్యార్థిని అపర్ణ ఎంపిక

అల్లవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో గోడి బాలికల గురుకుల కళాశాల ఇంటర్ విద్యార్థిని ఎం.అపర్ణ టెన్నికాయిట్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. టెన్నికాయిట్ పోటీల్లో అపర్ణ అండర్-19 విభాగంలో టెన్నికాయిట్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శిష్ల కిరణ్మయి తెలిపారు. అపర్ణను వైస్ ప్రిన్సిపాల్ గొల్లపల్లి వెంకటేశ్వరమ్మ, కె.మౌనిక, వి.శాంతి, పీఈటీ తలుపులమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్టుషాపులపై దాడి.. ఇద్దరి అరెస్టు
ముమ్మిడివరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. అయినాపురంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న మట్టా నాగభూషణంను అరెస్టు చేసి, తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అమలాపురం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామానికి చెందిన యనమదల హనుమంతరావు బెల్టు షాపుపై దాడిచేసి అతడి నుంచి 13మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు. అలాగే పాత బెల్టు షాపులకు సంబంధించి ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని వారిపై బైండోవర్ కేసులు నమోదుచేసి తహశీల్దార్ కోర్టుకు హాజరుపరిచామన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు
రాజోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.వీరబాబు సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. మామిడికుదురులో ఏడు మద్యం సీసాలు, తాటిపాకలో ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని మద్యం అమ్ముతున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఐలు సీహెచ్ స్వామిరెడ్డి, కె.రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయండి
అంతర్వేది, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అంతర్వేది దేవస్థానం కౌలు రైతుల సమస్యలు, వారు దేవస్థానం భూముల్లో నిర్మించిన ఇళ్లకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఈనెల22వ తేదీన కౌలు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు భారీ సదస్సు నిర్వహిస్తున్నట్టు రాజోలు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కౌలు రైతుల సమస్యల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ఈసదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శృంగవరప్పాడు గ్రామంలో మంగళవారం జరిగిన కౌలు రైతుల సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి మాట్లాడారు. రైతులంతా పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. నల్లి బుజ్జిబాబు, ఓగూరి టాండన్‌రాజు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

హాల్ కోటాయింపుపై కవిసంధ్య హర్షం
యానాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యానాంలో సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ వేదికలు ఉచితంగా ఇవ్వడంపై యానానికి చెందిన కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి హర్షం వ్యక్తం చేశారు. యానాంలో ఇకపై జరిగే సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, గ్రంథావిష్కరణలు తదితర సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రభుత్వ వేదికలను ఉచితంగా కేటాయిస్తూ సీఎం రంగసామి నిర్ణయం తీసుకోవడంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కృషి అమోఘమన్నారు. కవిసంధ్య యానాంలో స్థాపించి 50సంచికలు పూర్తి చేసుకుని ఇటీవల స్వర్ణోత్సవ సభను యానాంలో ఘనంగా నిర్వహించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రంగసామి, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏ మునిస్వామిలకు కవిసంధ్య తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

పొలం పిలుస్తోంది..
అంతర్వేది, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రామంలోని రైతులందరూ హాజరయ్యారు. వ్యవసాయాధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను రైతులు సకాలంలో వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, కూటమి శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం
కపిలేశ్వరపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): టేకిలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం మంగళవారం రాత్రి వైభవరంగా జరిగింది. ప్రధాన అర్చకులు రఘు సారధ్యంలో స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. అశేషభక్త జనం స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించారు.

పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి
రావులపాలెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావుఅన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేరియర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ కె.రజనీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు.రాజమండ్రి టైమ్స్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.సాయికిరణ్ మాట్లాడారు.

వెలవెలబోతున్న ఆలమూరు రైతుబజారు

- రికార్డుల్లో ఆలమూరు బజారుకు గుర్తింపు కరువు
- నాణ్యత లేని కూరగాయలు విక్రయం
- ధరల నియంత్రణపై పర్యవేక్షణ నిల్
- పట్టించుకోని అధికారులు


ఆలమూరు రైతు బజారు

ఆలమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కనీస వసతులు, సరైన అజమాయిషీ లేకపోవడంతో ఆలమూరు రైతు బజారు వెలవెలబోతుంది. నామమాత్రంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు కూరగాయల ధరలు, నాణ్యతను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అసలు నిజం చెప్పాలంటే ఆలమూరులో రైతుబజారు ప్రారంభించి దాదాపు రెండేళ్లు కావస్తున్నప్పటికీ వ్యవసాయ మార్కెటింగ్ రికార్డుల్లో అధికారింగా నమోదు కాకపోవడం విడ్డూరంగా ఉంది. రికార్డుల్లో నమోదు కాకుండా రైతు బజారు నిర్వహించడంతో నామమాత్రంగా రైతులను గుర్తించి వారికి అప్పగించడంతో నాణ్యత లేని కూరగాయలను తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ధరల పట్టికను సరి చేసేవారే లేకపోవడంతో ఏధరకు ఏకూరగాయలు అమ్మకం చేస్తున్నది పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ రికార్డుల్లో ఆలమూరు పేరును చేర్చ కుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో రైతు బజారులా కాకుండా ప్రైవేట్ బజారు మాదిరిగా ఇక్కడ నడుస్తోంది. చిత్రమేమిటంటే ఇదే రైతు బజారు ముందు ఉన్న ప్రైవేట్ షాపుల్లోను అదే ధరలకు కూరగాయలు విక్రయించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కూరగాయల నాణ్యత, ధరల విషయంలో ఫిర్యాదు చేయడానికి ఇక్కడ ఎవరు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆలమూరు రైతుబజారుపై దృష్టి పెట్టి నాణ్యత గల కూరగాయలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అకాల వర్షం.. వరి రైతుల ఆందోళన



కె.గంగవరం: ధాన్యం రాశులకు టార్పాలిన్లు కప్పి భద్రపరచుకున్న రైతులు, కపిలేశ్వరపురం: మాచరలో చేలల్లోనే ఆరబోసి ఉన్న ధాన్యం

కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని అల్పపీడనం కారణంగా మండలంలో మంగళవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. దీంతో వరి రైతులు పంటను రక్షించుకోవడానికి అవస్థలు పడ్డారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు యంత్రాలతో పంటను కోసుకుని తేమ శాతం తగ్గించుకునేందుకు ఆరబె ట్టుకుంటున్నారు. వాతావరణంలో ఉన్నట్టుండి వచ్చిన మార్పులతో రైతులు పంటలను టార్పాలిన్లు వేసి భద్రపరచుకున్నారు. వర్షం కారణంగా మంగళవారం కోతలు నిలిచిపోయాయి. వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలిగింది.

అకాల వర్షం
కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంట చేతి కంది వచ్చే తరుణంలో తుఫాన్ కారణంగా మంగళవారం కురిసిన అకాల వర్షానికి అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. రైతులు పండించిన వరి పంట వివిధ దశల్లో ఉంది. చేలల్లో పనల రూపంలో, యంత్రాలతో కోత కోసే దశలో, ధాన్యం ఒబ్బిడి చేసుకునే దశల్లో రైతులు తలమునకలై ఉన్నారు. అప్పులు చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వస్తుందో, లేదో తెలియని పరిస్థితిలో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టిమిట్టాడుతూ ఆవేదన చెందుతున్నారు. అంగర, కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, మాచర, వెదురుమూడి, కాలేరు, వల్లూరు, నేలటూరు గ్రామాల పరిధిలో పంటకోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షం కారణంగా చేలల్లోకి నీరుచేరి చేలల్లో, రోడ్ల ప్రక్కన వేసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల ధాన్యాన్ని బరకాలు వేసి కప్పుకున్నారు. మధ్యాహ్నం వర్షం తగ్గడంతో ధాన్యాన్ని సంచుల్లో నింపి ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. చేతికి అందివచ్చిన పంట నష్టానికి గురవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పంట తడిస్తే పెటుబడులు రావని ఆందోళన చెందుతున్నారు.

కోటిపల్లి శివాలయంలో లక్ష బిల్వార్చన


శివలింగాకారంలో ఏర్పాటు చేసిన జ్యోతులు


ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన

కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఏకాదశి పురస్కరించుకుని లక్ష పత్రి పూజ చేశారు. కాట్రేనికోన వాస్తవ్యులు చెక్క నాగశ్రీకృష్ణ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. శివలింగాకారంలో జ్యోతులు వెలిగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు
కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కె.గంగవరంలో భక్తులు యినకొండ రామారావు, దునే శ్రీనివాస్, లక్ష్మీశ్రీనివాస్, గంగాపాత్రుల సత్యనారాయణ, విల్లా సత్యనారాయణ మూర్తి నగర సంకీర్తన, భజనలతో గ్రామోత్సవాలు నిర్వహించారు.

ద్రాక్షారామలో జ్యోతిర్లింగార్చన
ద్రాక్షారామ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. యర్రపోతవరం గ్రామానికి చెందిన కోలా నాగేశ్వరరావు కుటుంబీకులు కార్తీక మాసంలో ప్రతీఏటా నిర్వహించే విధంగా మంగళవారం జ్యోతిర్లింగార్చన జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కమ్యూనిటీ హాలును వినియోగంలోకి తీసుకురావాలి
మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో ప్రభుత్వాసుపత్రి చెంతన నిర్మించిన కమ్యూనిటీహాలు సామాన్య, మధ్య తరగతి వారు వేడుకలు చేసుకునేందుకు ఉపయోగపడేదని, దాని చెంతన చేపట్టిన మరో హాల్ నిర్మాణం నిలిచిపోయిందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు యండ్ల రాజేష్ ఆరోపించారు. పాత కమ్యూనిటీ హాల్‌కు వెళ్లేదారిలేక నిరుపయోగంగా మారిందన్నారు. కొత్త కమ్యూనిటీ భవనం పూర్తి చేయాలని కోరారు.

భవిత కేంద్రం తనిఖీ
రాయవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సోమేశ్వరం ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్‌లో ఉన్న భవితా కేంద్రాన్ని మంగళవారం జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రతివారం జరిగే ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, భవిత కేంద్రం ఉపాధ్యాయుల పనితీరును తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పి.ఆదర్శ్, టి.వీరవేణి , విద్యార్థుల తల్లి దండ్రులు ఉన్నారు.

శిథిల పాఠశాలలకు వేలం
కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిథిలమైన పాఠశాలలకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎంపీ డీవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తాళ్ళపోడు శివారు భీమ్‌నగర్, కుడుపూరు, బట్లపాలిక శివారు కాపూరివారిపేట, రావిడొడ్డిపేట గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని కూల్చివేయడం, తద్వారా వచ్చిన మెటీరియల్‌ను పాటపెడతామని చెప్పారు. ఆసక్తిగల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

సాన్స్‌పై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన


సాన్స్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్యాధికారి డా. రత్నకుమారి ఆధ్వర్యంలో సాన్స్‌పై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి రత్నకుమారి మాట్లాడుతూ న్యుమేనియా ప్రమాదకరమైన వ్యాధి అని, ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లల్లో మరణాలకు ఇది ముఖ్యమైన కారణమవుతుందన్నారు. మంగళవారం నుంచి ప్రతీ రోజూ క్షేత్రస్థాయి సిబ్బంది(ఆశలు, ఏఎన్ఎంలు) ప్రతీ ఇంటిని సందర్శించి ఐదేళ్లలోపు గల పిల్లలు ఉన్న ఇంటిని గుర్తించి, వారికి సాన్స్‌పై స్క్రీనింగ్ జరిపి అనుమానితులను ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసదుపాయం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ లు ఆరోగ్య ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు భూసారపరీక్ష ఫలితాల పత్రాలు


రైతులకు భూసార పరీక్షా ఫలితాల కార్డు అందచేస్తున్న ఏవో

ద్రాక్షారామ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉండూరులో మంగళవారం రైతులకు భూసార పరీక్షా ఫలితాల పత్రాలు అందజేశారు. ఉండూరులో రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా రైతులు ఎరువులు తగు మోతాదులో వాడుకుని పంట నష్టాలు రాకుండా కాపాడుకోవాలని కోరారు. పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ పి.రామచంద్రరావు మాట్లాడుతూ పశుపోషణ గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ సత్యనారాయణ, వీహెచ్‌ఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. 12 కేసుల్లో 13మంది అరెస్టు
ఆలమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారులు అక్టోబరు, నవంబరు నెలల్లో నిర్వహించిన దాడుల్లో సారా, మద్యం విక్రయదారులపై 12కేసులు నమోదుచేసి 13 మందిని అరెస్టు చేసినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీనాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈకేసుల్లో 42 లీటర్ల సారా, 19లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. మద్యం విక్రయాలపై 9701287828కి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతా టమన్నారు. మండపేటలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న మండపేటకు చెందిన టి.ఇజ్రాయిల్, జి.సూర్యనారాయణలను అరెస్టుచేసి 21 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సూపర్‌సిక్స్ అమలులో చంద్రబాబు విఫలం
రావులపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలను ఆశ చూపి, అధికారం చేజిక్కుంచుకున్న చంద్రబాబు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తానన్న సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించారన్నారు. 5నెలలపాటు బడ్జెట్ ప్రవేశపెట్టలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారన్నారు. ఉచిత ఇసుక, మద్యం పాలసీలతో ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి
ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల

కె.గంగవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, విముక్తి, అసమానతలు లేని సమాజం కోసం అమరుల స్ఫూర్తితో పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యమంలో అశువులు బాసిన అమరులను స్మరించు కుంటూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కె.గంగవరం శెట్టిబలిజ కల్యాణ మండపంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు అమరుల త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, రైతు కూలీ సంఘం నాయకులు రావి భాను, కె.పనసరామన్న, చిర్రా సుగుణ, కాశీ లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా ఆమోదయోగ్యమైన బడ్జెట్



కొత్తపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇది ప్రజాఆమోదయోగ్యమైన బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కుదేలైన ఆర్థిక రంగాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రధాని నరేంద్రమోదీ అండదండలతో డిప్యూటీ సీఎం పవన్ నిర్ణయాలతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి పునఃనిర్మాణానికి సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తూ బడ్జెట్ రూపొందించారని, విద్యా, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేశారన్నారు. విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో బకాయిలను దశల వారీగా నిధులు విడుదల చేసి ఆదుకుంటామని హామీ ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.


పౌర్ణమి హారతి ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

పౌర్ణమి హారతికి ఏర్పాట్లు
కె.గంగవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రంలో పవిత్ర గోదావరి నదికి కార్తీక పౌర్ణమి హారతి ఇవ్వడానికి మాన్సాస్ ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలతో మాన్సాస్‌ట్రస్టు వారు హారతి ఇవ్వడానికి ముందుకు వచ్చారు. దీని నిమిత్తం ట్రస్టు డీసీ కె.ఎన్.డి.వి.ప్రసాద్ మంగళవారం కోటిపల్లిలోని గోదావరినది తీరాన్ని పరిశీలించారు. ఆలయంలో అధికారులతో చర్చించారు. శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఈవో భీమశంక రానికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు గొడవర్తి రామకృష్ణ, సీహెచ్. రాము, తదితరులు పాల్గొన్నారు.

15న పీఠంలో కార్తీక పౌర్ణమి పూజలు
రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మంగళవారం తెలిపారు. కార్తీక పౌర్ణమి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. దుర్గా అమ్మవారికి మహిళలచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు జరిపిన అనంతరం అన్నసమారాధన జరుగుతుందని అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.

సంఘమేశ్వరుడికి అన్నాభిషేకం
మండపేట, నవంబరు 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఏడిదలో ఉన్న వర పార్వతీసమేత శ్రీసంఘమే శ్వరస్వామికి మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకసహి త అన్నాభిషేకను నిర్వహించారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణ, నాగభూషణశర్మ స్వామి వారికి అన్నాభిషేకను నిర్వహించారు.


సంఘమేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

కోటిపల్లి ఫెర్రీని పరిశీలించిన ఆర్డీవో


కోటిపల్లి ఫెర్రీ రేవును పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

కె.గంగవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ముక్తేశ్వరం ఫెర్రీలో జరుగుతున్న పనులను రామ చంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశీలించారు. కార్తీకమాసం భక్తుల ఇబ్బందులు, ప్రయాణికులు దూరాభారం తదితర అంశాలతో ప్రతికల్లో వచ్చిన వార్తలతో అధికార యంత్రాంగం కదిలింది. కోటిపల్లి ఫెర్రీ రేవులో రాకపోకలు పునరుద్ధరించడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నారు. ఫెర్రీలో పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం ఆర్‌డీవో అఖిలరేవులో పనులు పరిశీలించారు. రేవు నిర్వాహకులతో మాట్లాడారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) పనులు గురించి వివరించారు. పనులు తొందరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె వెంట కె.గంగవరం తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్.ఐ. వెంకట్రావు, కూటమి నాయకులు పెమ్మాడి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన
కె.గంగవరంలోని టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు గురించి ఆరా తీశారు. పోలింగ్ కేంద్రానికి ర్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్.ఐ.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం
రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయవరం తుల్యాబాగ వంతెన సమీపంలో ఉన్న గోవిందాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం మంగళవారంరాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణం పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కల్యాణం సందర్భంగా భక్తులు దీపారాధనలు చేశారు. రాయవరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి రూ.2.10లక్షల విరాళం
ఆలమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతున్న విద్యార్థుల ఫీజులు, ఇతర ఖర్చుల నిమిత్తం ఆలమూరు ఎడ్యుకేషన్ ట్రస్టు రూ.2.10లక్షల విరాళాన్ని ట్రస్టు సభ్యులు అందించారు. డిగ్రీ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజుల నిమిత్తం రూ.1.63లక్షలు, కాలేజీలోని మంచినీటి సౌకర్యం, ఇన్వర్టర్ ఏర్పాటు తదితర అవసరాల నిమిత్తం రూ.50వేలును కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.నరసింహస్వామికి ట్రస్టు ఛైర్మన్ గుణ్ణం వీర్రాజు, జాయింట్ కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు అందజేశారు. కాలేజీలో చేరే మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజులను ట్రస్టు పూర్తిగా బాధ్యత తీసుకుని చెల్లిస్తుందని విద్యార్థుల తల్లి దండ్రులు ఆలమూరు డిగ్రీ కాలేజీలో చేర్పించి ఉన్నత విద్యను అభ్యసించాలని ట్రస్టు సభ్యులు కోరారు. కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి విరాళం అందిస్తున్న ఎడ్యుకేషన్ ట్రస్టు

30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దొరబాబు


మెర్లపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుపై కరపత్రాలను అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): 11వ వేతన సవరణ గడువు 2023 జూలైతోనే ముగిసిందని తద్వారా గడువు ముగిసి 15 నెలలు కావస్తున్నా ఇంత వరకు 12వ వేతన సవరణ ఊసేలేకుండా పోయిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.దొరబాబు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆత్రేయపురం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించా రు. ర్యాలి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల గోడు వినే అవకాశం ఇవ్వ కుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై నోరు మెదపకపోవడం ఏరుదాటాక తెప్పత గలేయడమేనన్నారు. ఉపా ధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన రూ.25వేలకోట్ల బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని సీపీఎస్ రద్దు హామీ వంటి ప్రధాన అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణమే ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉభయగోదావరిజిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎస్టీయూ మద్దతుతో పోటీ చేస్తున్న గంధం నారాయణరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు తోట బాలకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన చక్రవర్తి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ భూపతిరాజు పెండేటి

అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్
సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- ఛైర్మన్ భూపతిరాజు పెండేటి

ఆత్రేయపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ సేవలు గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్ భూపతిరాజు పెండేటి పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురం గ్రామాన్ని ఫౌండేషన్ దత్త తీసుకోవడం జరిగింది. ప్రవాశాంధ్రుడు అమెరికాలో నివసిస్తున్న డాక్టర్ వేగేశ్న ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ రామకృష్ణంరాజు స్వగృహంలో గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. తమ ఫౌండేషన్ అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. ప్రజలకు అత్యంత భారంగా తయారైన క్యాన్సర్ తదితర రోగాలబారిన పడిన పేద ప్రజలకు తమ ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ సహకారం అందించలేని వైద్యసేవలకు ట్రస్టు సహకారం అందిస్తుందన్నారు. ఆరోగ్యం ప్రజలకు రక్షిత తాగునీరు దత్తత గ్రామంలో అందిస్తామని తద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్ భూపతిరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేగేశ్న ఛారిటబుల్ ట్రస్టు నిర్వహకురాలు ఉద్దరాజు విజయలక్ష్మి, పెద్దలు ముదునూరి రామరాజు, గ్లోబల్ ఫౌండేషన్ ఆర్గనైజర్లు నడింపల్లి వెంకటరామరాజు, ఆర్యవైశ్యసంఘ ప్రముఖులు యలమర్తి వెంకటేశ్వరరావు, గ్లోబల్ ఫౌండేషన్ స్థానిక కోఆర్డినేటర్ గాదిరాజు ప్రసాదరాజు పాల్గొన్నారు.

నేడు జనార్దనస్వామివారి తెప్పోత్సవం
మండపేట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న శ్రీదేవిభూదేవిమేత జనార్దనస్వామివారి తెప్పోత్సవం కోసం దేవదాయధర్మదాయశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం సాయంత్రం వైభవంగా జరిగే స్వామివారి తెప్పోత్సవం, కార్తీక దిపోత్సవానికి సంబంధించి పట్టణంలో నాలుగుగుడులు సమీపంలో వున్న బూరుగుంట రామాలయం వద్దవున్న మున్సిపల్ చెరువును ఉత్సవంకోసం సిద్ధం చేశారు. ఇప్పటికే తెప్పను తయారు చేశారు. స్వామివారిని చెరువులో ఏర్పాటుచేసిన తెప్పపై ఊరేగించనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్సవానికి ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. పట్టణ పోలీసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
రాయవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రంథాలయంలో ఈనెల 14నుంచి 20వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.రత్నాబాయి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖం, దేశభక్తి గేయాలుపై పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఈపోటీ ల్లో పాల్గొని విజేతలైన విద్యారుల్థకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పా రు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండలంలోని అంగర, కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 14 నుంచి 20వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి దానేటి శివకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 14న ఉదయం బాలల దినోత్సవం, గ్రంథా లయ వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న పుస్తక ప్రదర్శనలు,(15నుంచి 20వరకు) డ్రగ్స్‌పై అవగాహన పుస్తకాలు చదవడం, ప్రాముఖ్యత, 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న చిత్రలేఖనం, 18న జనరల్ నాలెడ్జ్, 19న మహిళా దినోత్సవం, 20న గ్రంథాలయాల ముగింపు సభ, పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుందని ఆమె తెలిపారు.